క్లుప్తంగా

కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి



ఉండవెల్లి: మండలంలోని ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించి, కూలి పెంచాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కనీస కూలి రోజుకు రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు. కూలీలకు ఎండల తీవ్రతలో టెంట్ ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ అందజేయాలని తెలిపారు. కార్యాక్రమంలో నర్సింహ, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, నాగరాజు, ప్రభాకర్, అంజి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, ఎన్నికల అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. వారు మాట్లాడుతూ వాహనాల్లో పెద్ద ఎత్తున నగదు మద్యం, సారా తరలిస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుక్వెళ్లేటప్పుడు వాటికి రశీదులను చూపించాల్సి ఉంటుందని తెలిపారు.

పశువులకు టీకాలు

గద్వాల వ్యవసాయం: పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడకుండా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో వేస్తున్న నివారణ టీకాల కార్యక్రమం కొనసాగుతుంది. మండల పశువైద్యాధికారి శంకరయ్య పర్యవేక్షణలో శుక్రవారం పట్టణంలోని జమ్మిచేడు, వెంకటంపల్లి, మండలంలోని బీరెల్లి, అనంతాపురంలో పశువైద్య సిబ్బంది 59 మంది రైతులకు చెందిన 681 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో సిబ్బంది మాధవిలత, తేజశ్విని, కృష్ణయ్య, రాముడు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

అయిజ: పశువుల్లో గాలికుంటు వ్యాధి రాకుండా అరికట్టేందుకు వేస్తున్న టీకాల కార్యక్రమం కొనసాగుతోంది. మండలంలోని కేశవరంలో వెటర్నరీ సిబ్బంది వ్యాక్సిన్ వేశారు.

ఒరిగిన విద్యుత్ స్తంభాలు



మానవపాడు: మండల కేంద్రం నుంచి అమరవాయికి వెళ్లే ప్రధాన రహదారి గుండా విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. వర్షాకాలంలో వంతెన పైభాగం వరకు నీరు వస్తుంది. గాలులకు, వర్షాలకు విద్యుత్ స్తంభాలు విరిగి పడే అవకాశం ఉంది. చాలా సార్లు అధికారులకు తెలిపామని మానవపాడు, అమరవాయి గ్రామాల ప్రజలు వాపోయారు. ఇంత వరకు పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని గ్రామాల్లో గుడ్ ఫ్రైడేని క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాస్టర్లు, సంఘ కాపరులు ఏసుక్రీస్తు గురించి, గుడ్‌ఫ్రైడే ఎందుకు చేసుకుంటామనే విషయాలు వివరించారు. తనగలయంబి కల్వరి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక సంఘ కాపరి రెవ. సతీష్‌కుమార్ మాట్లాడుతూ కరుణామయుడైన ఏసు ప్రభువును శిలువ వేసిన రోజును గుడ్‌ఫ్రైడేగా చేసుకుంటారన్నారు. అనంతరం ఏసు పునరుజ్జీవించిన ఆదివారం రోజు ఈస్టర్ పర్వదినాన్ని నిర్వహించుకోవాలన్నారు. ఈ రెండు వేడుకలు మానవాళి చరిత్రను మలుపులు తిప్పిన ఘట్టాలన్నారు.

అయిజ: మండల కేంద్రంలో, గ్రామాల్లో క్రైస్తవులు గుడ్ ఫ్రైడే భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రైస్తవులు 40 రోజులపాటు ఉపవాసం ఉండి గుడ్ ఫ్రైడే చివరి రోజు పాస్టర్లు భక్తులకు ద్రాక్ష, అరటి పండ్లు, నిమ్మ రసాన్ని అందించారు.

మానవపాడు: మండల కేంద్రంతో పాటు గ్రామాల చర్చిలలో గుడ్‌ఫ్రైడే భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రైస్తవులు క్రీస్తు మరణాన్ని స్మరించుకుంటూ 40 రోజులుగా చేస్తున్న ఉపవాస దీక్షలు గురువారంతో ముగిశాయి. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. చెన్నిపాడు చర్చిలో పాస్టర్ సునిల్ అమృతరాజ్ మాట్లాడుతూ.. మానవళి కోసం ఏసుప్రభు చేసిన కృషి, త్యాగాలను వివరించారు.

మల్దకల్: మండలంలో గుడ్ ఫ్రైడే క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామాల్లోని చర్చిలలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



మునుగాలలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



ధరూరులో సందేశమిస్తున్న పాస్టర్



అయిజలో సందేశమిస్తున్న పాస్టర్

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని గ్రామాల్లో గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని క్రైస్తవులు చర్చిల్లో ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు శిలపై పలికిన ఏడు మాటలను ధ్యానం చేస్తూ ఉపవాస దీక్షలను విరమించారు.

పాపుల కొరకు ప్రాణం విడిచాడు

ధరూరు: ఏసు క్రీస్తు ఈ లోక పాపుల కోసం ప్రాణం విడిచాడని పాస్టర్లు తెలిపారు. గుడ్ ఫ్రైడేని పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు చర్చిల్లో ఉపవాస ప్రార్థనలు చేశారు. ధరూరు ఎంబీ షాలేము చర్చి పాస్టర్ సీపీ ప్రసాద్ యూదా, హోసన్నా మందిరం, మరనాథ విశ్వాస సమాజం, కల్వరి బాప్టిస్టు చర్చి పాస్టర్లు ప్రభాకర్, సుదర్శన్ అబ్రహాం, కృపరాజ్‌లు బైబిల్ ప్రవచనాలను వినిపించారు. ప్రతి ఒక్కరు క్రీస్తును పోలిన జీవితాన్ని గడపాలని సూచించారు.



తనగల చర్చిలో..



ధరూరు ఎంబీ చర్చిలో..



చెన్నిపాడులో..

నేడు విస్తృతస్థాయి సమావేశం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

శాంతినగర్: బీజేపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహిస్తున్న విస్తృతస్థాయి సమావేశానికి జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. వడ్డేపల్లి పుర పరిధిలోని ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం విలేకర్ల సమావేశం ఏర్పాటుచేశారు. సమావేశానికి ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్, తల్లోజు ఆచారి, ముఖ్య నాయకులు హాజరవుతారన్నారు. శాంతినగర్‌లోని భవాని ఫంక్షన్‌హాల్‌లో సమావేశం ఉంటుందన్నారు. సమావేశంలో తిరుమల్‌రెడ్డి, రాజగోపాల్, రాజశేఖర్‌శర్మ, శ్రీనివాస్, సంజీవరెడ్డి, నరసింహ, మురళీకృష్ణ, వేణుగోపాల్ పాల్గొన్నారు. అనంతర నమో యాప్ ద్వారా మైక్రో డొనేషన్ సిస్టంను ప్రారంభించారు.

ఎర్రవల్లిచౌరస్తా: శాంతినగర్‌లోని భవాని ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఉదయం 10గంటలకు నిర్వహించే ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి అధిక సంఖ్యలో తరలి రావాలని బీజేపీ మండల అధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ప్రకటనలో కోరారు.

బీజేపీ కమిటీ ఎన్నిక

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి శుక్రవారం మండల కన్వీనర్ శివారెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రాముడు, ఉపాధ్యక్షులుగా వీరేష్, వంశీ, జనరల్ సెక్రటరీగా విశ్వనాథ్‌గౌడ్, పలువురిని ఎన్నుకన్నారు. కార్యక్రమంలో హన్మిరెడ్డి, సూర్యకాంత్‌రెడ్డి, నాగేష్, ముంగ్లి వీరేష్, నాయకులు ఉన్నారు.

పోలీసుల అదుపులో బైక్ దొంగ?

శాంతినగర్: బైక్‌లు దొంగతనానికి పాల్పడే ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అయిజలో మోటార్‌సైకిల్ ఎత్తుకొచ్చి శుక్రవారం శాంతినగర్‌లో అమ్మడానికి ప్రయత్నించాడు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో ఓ మెకానిక్ వద్దకు వెళ్లి రూ.10 వేలకు బైక్ అమ్ముతానని తీసుకుంటారా అంటూ అడిగాడు. ఆర్సీ, ఇన్సూరెన్స్ పేపర్లు ఉంటే తీసుకుంటానని మెకానిక్ మాట్లాడాడు. నా బండే ఇది అవేమీ లేవని అందుకే తక్కువకు అమ్ముతున్నానని వివరించాడు. అనుమానం వచ్చిన మెకానిక్ వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు వచ్చి వివరాలు అడుగుతుండగా వారి ఎదుటే దొంగ పారిపోయాడు. ఇద్దరు వ్యక్తుల సాయంతో పోలీసులు వెంబడించి పట్టుకున్నట్లు స్థానికులు తెలిపారు. అనంతరం బైక్‌తోపాటు దొంగను స్టేషన్‌కు తరలించారు. వెంటనే అయిజకు చెందిన మోటార్‌సైకిల్ యజమానికి శాంతినగర్ పోలీసులు సమాచారం అందించగా స్టేషన్‌కు చేరుకున్నాడు. బైక్ సంబంధించిన డాక్యుమెంట్లు సరిచూసుకుని యజమానికి బైక్ అందజేసినట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్ఐ సంతోష్‌ను వివరణ కోరగా ఇంకా కేసు నమోదుకాలేదని, అయిన తర్వాత వివరాలు వెల్లడిస్తానని పేర్కొన్నారు.

కొంకలలో మద్యం పట్టివేత

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని కొంకల గ్రామంలోని ఓ హోటల్‌పై పోలీసులు దాడి చేసి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి హోటల్‌లో మద్యం అక్రమంగా నిల్వచేసి వ్యాపారం కొనసాగిస్తుండగా శాంతినగర్ పోలీసులు దాడిచేసి సుమారు 8 లీటర్ల మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై ఎస్ఐ సంతోష్‌ను వివరణ కోరగా.. కేసు ఇంకా నమోదు కాలేదని, నమోదైన తరువాత వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

21.7 లీటర్ల మద్యం పట్టివేత

ఉండవెల్లి: మండల కేంద్రంలోని బెల్ట్ షాపులలో ఎస్ఐ శ్రీనివాసులు తనిఖీ చేపట్టారు. శుక్రవారం మండల కేంద్రంలో శంకరమ్మ ఇంట్లో 21.7 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

గట్టు: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మఠం బూదెప్ప కుటుంబసభ్యులను శుక్రవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పరామర్శించారు. తల్లి ఆదెమ్మ, కుమారుడు మఠం బూదెప్ప ఒకేరోజు మృతి చెందిన విషయం తెలిసిందే. వీరిని ఎమ్మెల్యే, నాయకులు పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

వంతెనపై గుంతలు



మానవపాడు: మండల కేంద్రం నుంచి గోకులపాడు వెళ్లే ప్రధాన రహదారి వంతెనపై మూడు గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం ఈ దారి గుండా వాహనాలు భారీగా వెళ్తుంటాయి. రాత్రి వేళల్లో చూడకుండా గుంతలో వెళ్తే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు. వంతెనాపై ఎలాంటా ప్రమాదాలు కాకముందే వాడిని పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామాన్ని సందర్శించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ఉండవెల్లి: మండలంలోని మారమునగాల–1లో శుక్రవారం 'ఊరంతా ఒకటే బోరు' అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమవడంతో మిషన్ భగీరథ ఏఈ అర్షద్ స్పందించి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సమస్యను పరిశీలించారు. మిషన్ భగీరథ నీటి కోసం సంపును ట్యాంకు పక్కన ఏర్పాటు చేస్తామని తెలిపారు. నీటిఎద్దడి వస్తే ఇంకో బోరును ఏర్పాటు చేయిస్తామని పేర్కొన్నారు.



గ్రామంలో సమస్యపై ఆరా తీస్తున్న ఏఈ అర్షద్

కంకర వేశారు.. బీటీ మరిచారు



చర్లగార్లపాడు - ఎల్కూరు గ్రామాల మధ్యన రోడ్డుపై తేలిన కంకర

- ఏడేళ్లుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

మల్దకల్: గ్రామీణ రహదారులను మెరుగుపరిచి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు రహదారులను మంజూరు చేసింది. అందులో భాగంగానే 2018లో మంత్రిగా పని చేసిన (ప్రస్తుతం) కాంగ్రెస్ మంత్రి జూపల్లి కృష్ణారావు రూ.1.39కోట్లతో పెద్దపల్లి నుంచి పావనంపల్లి వెళ్లే బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎల్కూరు నుంచి ఈదులపల్లి, చర్లగార్లపాడు మీదుగా నీలిపల్లి స్టేజీ వరకు రూ.4కోట్లతో బీటీ నిర్మాణానికి ఎంతో ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించి ఏడుళ్లు గడుస్తున్నా రహదారులు పూర్తికాకపోవడంతో గ్రామస్తులు, ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై ప్రయాణించే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కంకర వేసి వదిలేయడంతో రోడ్లపై నిత్యం వాహనదారులు ఇబ్బందులు పడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారి నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లకు ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో పనులను అర్ధాంతరంగా నిలిపేశారు. గ్రామాల నుంచి రాకపోకలు సాగించే వాహనదారులకు, ప్రజలకు రోడ్డుపై ఏర్పడిన గుంతలు, కంకరతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీ రహదారి నిర్మాణ పనులు చేపట్టి ప్రమాదాలకు గురికాకుండా చూడాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

రాకపోకలకు ఇబ్బంది..



ఎల్కూరు నుంచి చర్లగార్లపాడు మీదుగా నీలిపల్లి స్టేజీ వరకు ఏర్పాటు చేయనున్న బీటీ రహదారి పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డుపై కంకర తేలడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాం. అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు.

– కాంతారెడ్డి, చర్లగార్లపాడు

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



పెద్దపల్లి నుంచి పావనంపల్లి వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి ఏడేళ్లవుతోంది. కంకర వేసి దానిని రోలింగ్ కూడా చేయకుండా వదిలేయడంతో ఆ రహదారిపై ప్రయాణించే ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– రాములు, పావనంపల్లి

నిధులు లేక పనులు నిలిచిపోయాయి



మండలంలోని ఆయా గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు అందకపోవడంతో పనులు నిలిచిపోయాయి. 50శాతం పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. నిధులు మంజూరైన వెంటనే మిగతా రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించి పూర్తి చేయిస్తాం.

– బషీర్, పంచాయతీ రాజ్ ఏఈ

ప్రమాదం అంచున ప్రయాణం



ధరూరు ఉన్నత పాఠశాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు

- రక్షణ కంచె లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లు

ధరూరు: మండలంలో గృహ వినియోగదారుల కోసం గ్రామాల్లో ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా ఉన్నాయి. రోడ్లు, పాఠశాలలు, ముఖ్య కూడళ్ల వద్ద ఉన్న కంచె లేకుండా ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో గద్వాల- రాయచూరు రహదారిని ఆనుకుని ఉన్న ప్రధాన విద్యుత్ లైన్‌తో పాటు మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. వీటి ఎదుటే ఉన్నత పాఠశాల ఉండడంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. స్థానిక రైస్‌మిల్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుకు ఆనుకుని ఉంది. ఉప్పేరు పునరావాస కేంద్రంలోనూ ఎక్కడ పడితే అక్కడ సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. ద్యాగదొడ్డిలో ఇళ్ల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో రెండేళ్ల క్రితం ఓ ఆవు షాక్‌కు గురై మృతి చెందింది.

ప్రభుత్వానికి నివేదించాం

ధరూరుతో పాటు కొన్ని గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు గురించి నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించాం. నిధులు రాగానే పనులు చేపడాతాం. త్వరలోనే నిధులు వచ్చే అవకాశం ఉంది.

– అనిల్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ

నీటి సౌకర్యం ఏదీ?

- వైకుంఠధామాల్లో నిరుపయోగంగా మారిన బోర్లు
- మోటార్లు ఏర్పాటు చేయని వైనం
- అంత్యక్రియల అనంతరం నీటికోసం తప్పని తిప్పలు



రామాపురం వైకుంఠధామం

శాంతినగర్: అంత్యక్రియల సమయంలో నీటి ఇబ్బందులు కలగకుండా ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోరు బావులు నిరుపయోగంగా మారాయి. వడ్డేపల్లి మండలంలోని పది పంచాయతీల్లో రూ.లక్షలు వెచ్చించి వైకుంఠధామాలు నిర్మించారు. చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. అంత్యక్రియలకు వచ్చిన వారికి కనీస సౌకర్యాలు కల్పించారు. అంత్యక్రియల అనంతరం ఇళ్లకు వెళ్లే సమయంలో కాళ్లు శుభ్రం చేసుకోవడం సంప్రదాయం. దీంతో ప్రభుత్వ నిధులచే బోరు బావులు తవ్వించి మోటార్లు ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో వేసిన మోటార్లను ఆయా గ్రామాల సర్పంచ్‌లు సొంత ప్రయోజనాల కోసం, ఇతర బోరు బావుల్లోకి మార్చి శ్మశానంలోని బోరు బావులను నిరుపయోగంగా మార్చారు. దీంతో అంత్యక్రియలకు వచ్చిన వారికి కనీసం కాళ్లు కడుక్కోడానికి నీరులేకుండా చేశారు. ఈ విషయమై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బోరు బావులకు మోటార్లు అమర్చి నీటి సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

మోటార్లు లేని వైకుంఠధామాలు

రామాపురం, వెంకట్రామనగర్, జూలెకల్, తనగల, జక్కిరెడ్డిపల్లిలో మోటార్లు లేని కారణంగా నిరుపయోగంగా మారాయి. కొంకల, బుడమొర్సులో బోర్లు వేసినా నీరు రానందున గ్రామాల్లోని బోరు బావుల ద్వారా కుళాయి నీటి సరఫరా అందిస్తున్నా సకాలంలో నీరు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. కోయిల్‌దిన్నె, జిల్లెడుదిన్నెలో చేతిపంపుల ద్వారా, జక్కిరెడ్డిపల్లి, తనగల మిషన్ భగీరథ కుళాయి ద్వారా నీటిని సరఫరా చేయాలని సంకల్పించారు. సకాలంలో ట్యాంకులు నింపనందున సమస్య తలెత్తుతోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. జూలెకల్, వెంకట్రామనగర్, తిమ్మాజిపల్లిలో ఎవరైనా మృతి చెందితే పంచాయతీ ట్యాంకర్లే దిక్కవుతున్నాయి.



మోటారు ఏర్పాటు చేయాలి



శ్మశానంలో బోరుబావి తవ్వారు. మోటార్ ఏర్పాటు చేయలేదు. ఎవరైనా చనిపోతే అంత్యక్రియల అనంతరం కాళ్లు కడుక్కోడానికి ఇబ్బంది అవుతుంది. శుభకార్యాలకు అయితే ఎవరైనా నీళ్లు ఇస్తారు. అంత్యక్రియలకు వెళ్లి వచ్చిన వారికి ప్రైవేట్ వారు బోరు నీటిని ఇవ్వనందున చాలా ఇబ్బందిగా ఉంటుంది. బోరు బావికి మోటార్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలి.

– వెంకటేష్ యాదవ్, జూలెకల్

మోటార్‌ను తీసుకెళ్లారు



మా ఊర్లోని వైకుంఠధామంలోని బోరుబావికి గతంలో మోటార్ ఉండేది. అంత్యక్రియల అనంతరం మోటార్ ఆన్‌చేసి కాళ్లు కడుక్కుని వెళ్లేవాళ్లం. ఏడాది క్రితం మోటార్‌ను తీసుకెళ్లారు. ఎక్కడికి తీసుకు వెళ్లారో తెలియని పరిస్థితి. అప్పటి నుంచి అంత్యక్రియలకు వచ్చే వారు ఇబ్బందులకు గురవుతున్నారు.

– చిన్న ఏసన్న, రామాపురం

నీటి సౌకర్యం కల్పిస్తాం



చాలా గ్రామాల్లోని వైకుంఠధామాల్లో నీటి సమస్య ఉంది. బోరు బావుల సౌకర్యం లేని చోట నీటి సౌకర్యం కల్పిస్తున్నాం. ఏ గ్రామంలోనైనా మనిషి మృతిచెందితే మాకు సమాచారం ఇచ్చిన వెంటనే పంచాయతీ ట్యాంకర్ పంపిస్తాం. లేదంటే ట్యాంకర్ అక్కడే పెట్టి నీటి సమస్య లేకుండా చూస్తాం.

– తిరుపతన్న, ఎంపీఓ, వడ్డేపల్లి మండలం

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. ఎర్రవల్లిచౌరస్తాలోని శివాంజనేయస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు నర్సింహస్వామి ఆధ్వర్యంలో సాయంత్రం కుంకుమార్చన నిర్వహించారు.

ఉసేన్ సాహెబ్ ఉర్సుకు ఏర్పాట్లు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని తనగలలో ఏఆటా నిర్వహించే ఉసేన్ సాహెబ్ ఉర్సుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏప్రిల్ నెల 3వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఉర్సు ఘనంగా నిర్వహించనున్నారు. ఏప్రిల్ 3 బుధవారం గంధం, గురువారం ఉర్సు ముబారక్, శుక్రవారం రోజున కిస్తి ఉత్సవాలు ఉంటాయని గ్రామ కమిటీ పెద్దలు, ప్రజలు తెలిపారు. ఇప్పటికే ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామస్తులు వివరించారు. గంధం కార్యక్రమానికి అవసరమయ్యే గుర్రాన్ని ఎంపిక చేసి తీసుకువచ్చినట్లు ఉసేన్ సాహెబ్ శిష్యులు పేర్కొన్నారు.